## కథ

# నిర్ణయం

**హోతా పద్మినీ దేవి**

**నీరజ మూర్తీభవించిన శోకదేవతలా వుంది. కోడలి తల నిమురుతూ ఓదారుస్తున్న సత్యవతమ్మ కూడా ఏడుస్తోంది. నీరజ భర్తృవియోగంతో పరితపిస్తుంటే, సత్యవతమ్మ కడుపుశోకంతో కుమిలిపోతోంది. ఏడ్చి ఏడ్చి ఆ ఇద్దరి కళ్ళూ అలసిపోతున్నాయి కాని, వాళ్ళ మనసులలోని బాధ మాత్రం అగ్నికీలలా జ్వలిస్తూనే వుంది.**

"బాధ సహజం. కానీ మనసు రాయి చేసుకోవాలి తప్పదు. వాడి ఆయువు తీరి వెళ్ళిపోయాడు" ఆనంద్ మరణవార్త విని సత్యవతమ్మని పరామర్శించడానికి వచ్చిన ఆమె తోటికోడలు విశాలాక్షి అంది కళ్ళు వత్తుకుంటూ.

"మమ్మల్నిద్దరినీ జీవితాంతం ఏడవమని వాడు వెళ్ళిపోయాడు. రాలిపోవడానికి సిద్ధంగా వున్న ఆకుని. నేనెలాగో బ్రతుకు నీడ్చేస్తాను. కాని, నిండా ముప్ఫయి ఏళ్ళయినా లేని నీరజ ఎలా బ్రతుకుతుంది" పైట కొంగులో ముఖం దాచుకుని ఏడుస్తూ అంది.

"ప్చ్! కనీసం పిల్లలుంటే వాళ్ళని చూసయినా కొంత బాధ మరచిపోయేది!" సానుభూతిగా అంది విశాలాక్షి.

అత్తాకోడళ్ళ విషణ్ణ వదనాలలో మరింత విషాదం అలుముకుంది.

"దేవుడు చిన్నచూపు చూసాడు. ఏం చేస్తాం" అంది సత్యవతమ్మ.

"మన వంశంలో అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూసినా పిల్లలు లేని వాళ్ళే లేరు. అయినా ఈ రోజులలో వైద్యానికి లొంగనిదేం వుంది? మీరు అశ్రద్ధ చేసారేమో"

"అంతా నా కర్మ! నా కోడలి దురదృష్టం! ఒకళ్ళు కాదు. పదిమంది డాక్టర్లు చూసారు. లోపం వాడిలోనే వుందిట"

ఆ క్షణంలో అత్తగారు దేవతలా కనిపించింది నీరజ తండ్రికి. పిల్లలు పుట్టని కోడళ్ళని గొడ్రాళ్ళుగా ముద్రవేసి సాధించే అత్తగార్లని గురించి విని వుందామె. తన కొడుకులోని లోపాన్ని హుందాగా అంగీకరించిన అత్తగారిపట్ల గౌరవభావం రెట్టింపయింది ఆమెకి.

ఆనంద్ దశదిన కర్మ పూర్తయింది. బంధుజనం ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళారు. గత రెండు రోజులుగా అత్తగారు, ఆడబడుచు, తోటికోడలు రహస్యంగా ఏదో విషయాన్ని మాట్లాడుకోవడం అంత దుఃఖంలోనూ నీరజ గమనించలేకపోలేదు.

మూడవరోజు ఉదయం ఇంట్లో ఎవరి హడావుడిలో వాళ్ళుండగా సత్యవతమ్మ ఆమెని మేడమీది గదిలోకి పిల్చుకెళ్ళింది.

"నీ భవిష్యత్తు గురించి ఏం ఆలోచించావమ్మా?" ఎలాంటి ఉపోద్ఘాతము లేకుండా సూటిగా అడిగింది.

"భవిష్యత్తా?" విరక్తిగా అంది. "గతంలో బతుకుతూ జీవితాన్ని ఈడ్చడం తప్ప నాకు భవిష్యత్తు పై ఆశలు లేవత్తయ్యా!"

"జీవితంలో నీకంటూ ఒక తోడు వుండద్దామ్మా?"

అత్తగారి మాటలలోని అర్థం ఆమెకి బోధపడలేదు.

"పెద్దదాన్ని. నేను చెప్పిన మాట విను. అమర్ రెండో కొడుకు బాబీని పెంచుకో. బాబీని దత్తత తీసుకుని గిరిజ కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తే పిల్లలిద్దరూ నీ కళ్ళముందే వుంటారు."

తమకి పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్లు చెప్పాక అత్తగారు ఈ ప్రతిపాదనని తీసుకురావడం అందుకు ఆనంద్ నిరాకరించడం గుర్తొచ్చింది నీరజకి.

"ఏదైనా అద్భుతం జరిగి తనకి పిల్లలు పుడతారనే ఆశతోనో, మరే కారణం చేతనో అప్పట్లో ఆనంద్ నా ప్రతిపాదనని తిరస్కరించాడు. కానీ, ఇప్పుడు వాడు లేడు. నువ్వొంటరిగా జీవితాన్ని గడపడం కష్టం. బాబీని పెంచుకుంటే వాడు నీకు ఆసరా అవుతాడు."

'ఊహ తెలియని పసి వయసులో బాబీని పెంచుకుంటే అది వేరే సంగతి. పదేళ్ళ బాబీకి, వాడిని కన్న వాళ్ళెవరో తెలుసు. తను పెంచుకున్నంత మాత్రాన వాడు తనని తల్లిగా అంగీకరిస్తాడా?' నీరజ ఆలోచిస్తోంది.

"లేదా, నీకు ఆడపిల్లని పెంచుకోవాలనే సరదా వుంటే, గిరిజ కూతుర్ని పెంచుకో."

"మా అబ్బాయినే పెంచుకో నీరజా!" అంటూ గదిలోకి వచ్చింది స్వరూప. ఆమె ముఖం ఉద్విగ్నంగా వుంది. అత్తగారి ప్రపోజల్‌ని నీరజ ఎక్కడ నిరాకరిస్తుందోననీ కంగారు ఆమె ముఖంలో ద్యోతకమవుతోంది.

"మా అమ్మాయిని బాబీకిచ్చి పెళ్ళి చేస్తానని నాకు వాగ్దానమిచ్చి మరీ వాడిని దత్తత తీసుకో. అలా వీలు కాని పక్షంలో మా అబ్బాయిని పెంచుకో" స్వరూప వెనకాలే వచ్చిన గిరిజ అంది.

స్వరూప ముఖంలో ఖంగుతిన్న భావం.

"నీకున్నది ఒక్క అబ్బాయి. వాడిని దత్తత ఇస్తావా?" నిరసనగా ఆడబడుచుని చూస్తూ అడిగింది స్వరూప.

"నీకు మహా పది మంది పిల్లలున్నట్టు!" గిరిజ వదినని చుర చుర చూస్తూ అంది.

"అబ్బబ్బ! తగవులాడుకోకండి. ఎవరైనా వింటే నవ్విపోతారు. నీరజా! పెద్దదాన్ని. నా మాట విను. బాబీని దత్తత తీసుకుని గిరిజ కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తే ఇద్దరికీ న్యాయం చేసినట్టవుతుంది. ఇవాళ పంచమి మంచి రోజు. నీ మనసులోని మాట చెప్తే వాళ్ళకి నిశ్చింతగా వుంటుంది."

"అవును" అన్నారు స్వరూప, గిరిజ ముక్తకంఠంతో.

"నేను ఆలోచించుకోవాలత్తయ్యా!" అంది నీరజ. ఆమెకి ఆ పరిస్థితిలో ఏం మాట్లాడాలో తోచలేదు.

"మా అమ్మాయిని బాబీకిచ్చి పెళ్ళి చెయ్యి. లేకపోతే మా అబ్బాయినే పెంచుకో" అని గిరిజ "మా అబ్బాయిని పెంచుకో" అని స్వరూప పోటీపడడం చూస్తే ఆమెకి ఆశ్చర్యంగా వుంది. ఇద్దరేసి పిల్లలున్న వాళ్ళు తనకి ఒక బిడ్డని దత్తత ఇస్తాననడం త్యాగమా లేక స్వార్థమా?

'ఆలోచించడానికేం వుంది? కష్టపడి కనకుండా పదేళ్ళ పిల్లాడిని దత్తత ఇస్తానంటే?' అదోలా నవ్వుతూ ఇంకేదో అనబోతున్న స్వరూప అత్తగారి కనుసైగతో ఆగిపోయింది.

"ఆలోచించుకునే చెప్పు" అంది సత్యవతమ్మ.

నీరజని ఒంటరిగా వదిలి అందరూ కిందకి వెళ్ళారు.

నీరజకి భర్త గుర్తుకొచ్చాడు.

'అతనికి పిల్లలంటే ఎంత ఇష్టం? ఇంట్లో వున్నంతసేపూ బాబీతో ఆడుతూనే వుండేవాడు. కాని, వాడిని దత్తత చేసుకోడానికి అతను ఎందుకు విముఖత చూపినట్టు?' ఆమె ఆలోచిస్తోంది.


★ ★ ★

ఆచారం ప్రకారం పుట్టింటికి ప్రయాణమయింది నీరజ.

స్నేహితులు, సన్నిహితులు, బంధువులు అందరూ ఆమెని పరామర్శిస్తున్నారు. ఆమె దురదృష్టానికి జాలి పడుతున్నారు.

"ఇంక ముందు నీ జీవితమెలా గడుస్తుందమ్మా?" తండ్రి వాపోయాడు. "ఏం చెయ్యాలనుకుంటున్నావ్?"

"మనం ఎన్నో అనుకుంటాం. అనుకున్నవన్నీ జరుగుతాయా నాన్నా? ఆనంద్ నాకు నూరేళ్ళూ తోడుగా వుంటాడని అతని పిల్లలకి తల్లినై మాతృత్వంలోని మధురిమ



లని పండించుకోవాలని కలలు కనేదాన్ని. కానీ, నా కలలు కల్లలయిపోయాయి. జీవితంలో ఇంకేం మిగిలిం దని ఆశపడ్డానికి?" గాద్గదికంగా అంది.

"మీకు పిల్లలు పుట్టరని, డాక్టర్లు చెప్పిన వెంటనే ఎవ ర్నయినా పెంచుకోవలసిందమ్మా!" అంది తల్లి.

"నేను ఆ ప్రస్తావన తెచ్చినప్పుడల్లా ఆయన నా మాట లని కొట్టి పారేసేవారమ్మా! కోరి కొత్త సమస్యలని తెచ్చుకో వటమెందుకనే వారు. నేనిక్కడికి వచ్చే ముందు మా అత్త గారు కూడా ఇదే విషయం ప్రస్తావించారు. నిజానికి ఆయన బతికి వున్నప్పుడే ఈ ప్రతిపాదన తెచ్చారు"

"ఏమిటది?"

"మా బావగారబ్బాయిని పెంచుకుని వాడు పెద్ద య్యాక మా ఆడబడుచు కూతురినిచ్చి పెళ్ళి చెయ్య మంటున్నారు. అది వీలుకాని పక్షంలో మా ఆడబడుచు తన కొడుకుని దత్తత ఇస్తానంటోంది"

నీరజ తల్లీతండ్రీ ముఖాలు చూసుకున్నారు.

"మా బావగారబ్బాయంటే మా ఆయనకి చాలా ఇష్టం. కానీ ఎందుకో తెలియదు మా అత్తగారు ఈ ప్రతిపాదన తెచ్చినప్పుడు ఆయన ఇష్టపడలేదు. ఇప్పుడు నేను ఒంటరిదాన్నని వాళ్ళకి జాలి. అయినా వాళ్ళబ్బాయిని నాకు దత్తత ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు కానీ, మా బావగారికి మాత్రం పిల్లలు ఇద్దరేగా? వాడిని వదిలి వాళ్ళు మాత్రం ఎలా వుంటారు? నేనంటే మా తోటికోడ లికి పిచ్చి అభిమానం."

'వాళ్ళ అభిమానం నీపై కాదు. నీ భర్త వలన నీకు సంక్ర మించిన ఆస్తిపై' ఈ మాటలని నీరజ తండ్రి మనసులోనే అనుకున్నాడు.

★ ★ ★

"నీరజా!" పిలుస్తూ గదిలోకి వచ్చింది సుశీల.

"రా వదినా!" కన్నీళ్ళు తుడుచుకుంది.

సుశీల బాధగా ఆమె వైపు చూసి, నాలుగు ఓదార్పు వచనాల తరువాత అడిగింది.

"ఇంతకీ ఎవరిని పెంచుకోవాలనుకుంటున్నావ్?"

"మా బావగారికి ఇద్దరు మగపిల్లలున్నారు కాబట్టి మా అత్తగారు చెప్పినట్టు చేస్తేనే బాగుంటుందేమో!"

"నేను ఒక విషయం చెబుతాను. ఏమీ అనుకోవుగా?"

"చెప్పువదినా!"

"మీ తోటికోడలు నీ మీద అభిమానంతో తన కొడుకుని నీకు దత్తత ఇస్తానందని భ్రమలో వున్నావు నువ్వు. అసలు పుట్టింటి వాళ్ళం మాకు నీపై అభిమానం వుంటుంది కానీ, నీ అత్తింటి వాళ్ళకెందుకుంటుంది? నీ ఆస్తికోసం ఆశపడి వాళ్ళబ్బాయిని నీకు దత్తత ఇచ్చినా వాడిని నీకు చేరువ అవనిస్తారా? ఏదో కోపం లోనో వాడు తప్పు చేసా డనో నువ్వు వాడిని దండించావే అనుకో. మీ తోటికోడలి కంటే ముందు మీ అత్తగారే రియాక్టవుతుంది. నా మాట విని మా అమ్మాయిని పెంచుకో!"

నీరజ అనూహ్యమైన ఈ ప్రతిపాదనతో అవాక్కయింది.

"వదినా! నిన్ను అమ్మ పిలుస్తోంది" అంటూ గదిలోకి

వచ్చింది నీరజ చెల్లెలు నళిని.

"ఆ! వస్తున్నాను" కోరగా ఆమె వైపు చూసి నీరజతో అంది. "డైనింగ్ హాల్లోకి రా. అందరం అక్కడే కూర్చుందాం."

"వస్తాంలే! నువ్వెళ్ళు!" అంది నళిని.

సుశీల పళ్ళు కొరుక్కుంటూ అవతలకి వెళ్ళింది.

"ఏమంటోంది వదిన?" ఆమె వెళ్ళే దాకా ఆగిన నళిని అడిగింది.

"ఏం లేదు" అప్పటికి తెప్పరిల్లింది.

"నా దగ్గర దాపరికమెందుకులే, వాళ్ళమ్మాయిని నిన్ను పెంచుకోమంటోంది కదూ? నీ ఆస్తి ఎవరికిచ్చేస్తావోనని భయం ఆవిడకి. నువ్వేమన్నావ్?"

"ఏమీ అనలేదు"


"అస్సలు ఒప్పుకోకు. నువ్వు నేను అక్కా చెల్లెళ్ళం. మనది రక్తసంబంధం. మా అమ్మాయిని పెంచుకో. వేళా కోళం కాదు. నిజంగానే అంటున్నాను"

నీరజ దిమ్మెరపోయింది.

అటు తోటికోడలు, ఆడబడుచు - ఇటు వదిన, చెల్లెలు మా పిల్లలని పెంచుకోమంటే మా పిల్లలని పెంచుకో మని పోటీపడ్డానికి కారణం తనపై అభిమానంతోనా, కాదు. వారసులెవ్వరూ లేని తన ఆస్తి కలిసివస్తుందనే దూ(దు)రాలోచన.

# నిత్యనూతనం

**వయసు పెరుగుతున్నా గ్లామర్‌ని కాపాడుకునే వారు సినీతారలే కదా! అసలు సంగతి ఏమిటంటే వయసు పెరుగుతున్నా నిత్యనూతనంగా కన్పిస్తున్న అక్షయ్‌ఖన్నా గురించే ఇండస్ట్రీ జనం అంతా చర్చించుకుంటున్నారు. సుభాష్‌ఘాయ్ కొత్తచిత్రం హల్‌చల్ షూటింగ్ కోసం కాస్త లేట్‌గా వచ్చిన అక్షయ్‌ని చూసి అంతా స్టన్ అయిపోయారుట. మునుపెన్నడూ లేనట్టుగా స్మార్ట్‌గా కన్పించిన ఈ నటుడు మోడ్రన్ లుక్‌తో తన వయసుని సగం తగ్గించేసుకున్నాట్ట.**



"చెప్పక్కా" రెట్టించింది నళిని.

"నన్ను కాస్త ఆలోచించుకోనియ్యి!"

నీరజ వెంటనే అంగీకరిస్తుందనుకున్న నళినికి ఆశాభంగమయింది. తన అసంతృప్తిని బయటపడనివ్వకుండా "సరే" అంది.

★ ★ ★

"అమ్మా! అన్నం తిని రెండు రోజులయింది. ఒక రూపాయి ఇవ్వమ్మా! చాయ్ తాగుతా!" రైలు పెట్టెలో చీపురు పట్టి ఊడ్చే పదేళ్ళ పిల్లవాడి దీన స్వరం.

పేవ్‌మెంట్ మీద కూర్చుని తన లేత చేతులతో బూట్‌పాలిష్ చేస్తున్న కుర్రాడి పని ముఖం.

గుడిమెట్ల దగ్గర కడుపులోని ఆకలి కళ్ళలో ప్రతిఫలిస్తుండగా గుడికి వచ్చిపోయే భక్తులను యాచిస్తున్న రేపటి పౌరుడు.

"ఆకలి! ఆకలి! అమ్మా! ధర్మం చెయ్! అమ్మా! ఒక్క రూపాయి ఇవ్వమ్మా!" వేల గొంతులు పసిమొగ్గలు వీధి బాలలు.

నీరజ ఉలిక్కిపడి నిద్ర లేచింది. మంచం పక్కనే వున్న అలారం టైమ్‌పీస్ రాత్రి రెండు గంటలయిందని చెబుతోంది.

ఆమె మనసులో బాధ, దుఃఖం సుడులు తిరుగుతున్నాయి. కడలి కెరటాల్లాంటి ఆలోచనలు మనసుని అతలాకుతలం చేస్తున్నాయి.

కన్నీటితో దిండు తడిసింది. ఎంతకీ తెగని ఆలోచనతో మనసు అలిసిపోతోంది.

తోటి కోడలు, ఆడబడుచు, వదిన, చెల్లెలు వీళ్ళంతా తమ పిల్లలని తనకి దత్తత ఇస్తాననడంలో వాళ్ళ స్వార్థం వుంది. తన ఆస్తిని వాళ్ళ పిల్లలు అనుభవించాలనే దురాశ వాళ్ళది.

తనేం చెయ్యాలి? ఎవర్ని పెంచుకోవాలి? ఎవర్ని కాదనాలి? అలసటగా కళ్ళు మూసుకుంది.

తెల తెల వారుతుండగా ఆమె మనసులో చిన్న ఆలోచన పుట్టింది. క్షణాలలో అది నిర్ణయంగా బలపడింది.

★ ★ ★

"అత్తయ్యా! నాకు నా భర్త ఆస్తి కావాలి" నీరజ అలా అడగ్గానే తెల్లబోయింది సత్యవతమ్మ.

"అదేమిటి, ఇప్పుడు ఆస్తి విషయమెందుకు? అమర్ కొడుకుని దత్తత చేసుకోమన్నాను. ఆ విషయమేం ఆలోచించావ్?"

"మా వదిన, నా చెల్లెలు కూడా వాళ్ళ పిల్లలలో ఒకరిని దత్తత చేసుకోమన్నారు."

ఆవిడ ముఖం మాడిపోయింది.

"నువ్వు వాళ్ళకి మాట ఇచ్చావా? అందుకే ఆస్తి అడుగుతున్నావా?"

"నాకు ఎవరినీ పెంచుకునే ఉద్దేశం లేదత్తయ్యా! బాబికి తల్లిదండ్రీ వున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఆగర్భశ్రీమంతుడు వాడు. అటు మా వదిన పిల్లలకి, నా చెల్లెలి పిల్లలకీ కూడా లోటు లేదు. ఆకలేసిన వాడికి అన్నం పెట్టాలి కాని, కడుపునిండిన వాడికి ఇంకా ఏదో పెట్టాలనుకోవడం తప్పు. అందుకే నేను ఒక నిర్ణయానికి వచ్చాను. గుప్పెడు మెతుకుల కోసం అలమటిస్తున్న నిర్భాగ్యులైన వీధి బాలలకి ఆశ్రయం కల్పించాలనుకుంటున్నాను. అందుకు చాలా డబ్బు కావాలి. అందుకే అడుగుతున్నాను. నా భర్త ఆస్తి నాకివ్వండి"

"అసలు నీ గురించి నువ్వేమనుకుంటున్నావ్? నువ్వే మదర్ థెరిసావనా?" సత్యవతమ్మ నోరు పెంచింది.

"ఆ మహానుభావురాలి ముందు నేనెంతదాన్ని అత్తయ్యా?"

"చాల్లే! ఇంక మాట్లాడకు. నువ్వు గొడ్రాలివి. ఎవరి ఆసరా లేకుండా పోతున్నావనే జాలితో నా కోడలు, కూతురు వాళ్ళ పిల్లలలో ఎవరో ఒకర్ని పెంచుకోమంటే, కాదు పొమ్మంటావా? ఇటు అత్తింటివాళ్ళని, అటు పుట్టింటి వాళ్ళని కాదనుకుని ఎవరో అనాథల కోసం పాటు పడతానంటున్నావ్. రేపు నీ కాలు చెయ్యి వంగితే నిన్నెవరు చూస్తారు? నీ నోట్లో గుక్కెడు మంచినీళ్ళు కూడా ఎవరూ పొయ్యరు. గుర్తుంచుకో" కసితో ఆవేశంతో శాపనార్థాలు పెడుతోంది.

ఒకప్పుడు తనకి పిల్లలు పుట్టకపోవడానికి కారణం ఆనంద్‌లోని లోపమేనని బాహాటంగా అంగీకరించిన అత్తగారు ఇప్పుడు తనని గొడ్రాలు అంటున్నా నీరజకి బాధ కలుగలేదు. పైగా నవ్వొచ్చింది.

"అందరినీ కాదనుకున్న రోజే నేను అనాథనయ్యాను. నాలాంటి అనాథలు ఆశ్రయం పొందే చోటే నేనూ ఆశ్రయం పొందుతాను"

"ఆస్తి ఇవ్వనంటే ఏం చేస్తావ్?" కోడలి మొండి వైఖరికి మండిపడుతూ అంది సత్యవతమ్మ.

"నేను కోర్టుకి వెళ్ళే న్యాయం నావైపే వుంటుందని పెద్దవారు మీకూ తెలుసు. నా భర్తది హఠాన్మరణం కాబట్టి ఆయన ఆస్తిలో మీకు వాటా వస్తుంది. మీకు వచ్చేది మీరు తీసుకుని న్యాయంగా నాకు రావలసింది ఇవ్వండి" నీరజ స్వరంలో స్థిర నిర్ణయం ధ్వనిస్తుంటే సత్యవతమ్మ నిరుత్తరురాలయింది. ❀